ప్రజాశక్తి
www.prajasakti.com
I

ఎఫ్ఆర్ఒ శ్రీనివాసరావు మరణం బాధాకరం : తమ్మినేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎర్రబోడు గ్రామంలో గుత్తికోయలు, అటవీశాఖ అధికారులకు మధ్య జరిగిన దాడుల్లో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ఆర్ఒ) చలమల శ్రీనివాసరావు హత్యకు గురయ్యారనీ, ఆయన మరణం బాధాకరమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. ఆయన మరణం పట్ల బుధవారం ఒక ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. దీనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. దీర్ఘకాలంగా పోడు సమస్యను పెండింగ్‌లో ఉంచడంతో సమస్య జఠిలమై ఉద్రిక్త పరిస్థితులకు దారితీస్తోందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలతో గిరిజనులపై అటవీశాఖ సిబ్బంది దాడులు నిత్య కృత్యమయ్యాయని పేర్కొన్నారు. అనేకమంది గిరిజన రైతుల ఆత్మహత్యలతోపాటు, అటవీశాఖ అధికారులపైనా దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలనీ, పోడు సమస్యను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.

సిపిఐ ఖండన

ఎఫ్ఆర్ఒ చలమల శ్రీనివాస్‌రావును హతమార్చడాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తీవ్రంగా ఖండించారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అధికారులపై దాడులు సమర్ధనీయం కాదనీ, ప్రజా ఉద్యమాల ద్వారానే హక్కులను సాధించుకోవాలని సూచించారు. ఆ అధికారి కుటుంబానికి ప్రభుత్వం అన్ని రకాలుగా సహకరించి ఆదుకోవాలని కోరారు.

రామోజీ ఫిల్మ్ సిటీలో ఎర్రజెండాలు

- ప్రాణాలైనా ఇస్తాం.. స్థలాలు వదులుకోం
- పేదల భూములపై దౌర్జన్యం చేస్తే ఊరుకోం
- ఫిల్మ్ సిటీలో నిరసన వ్యక్తం చేసిన బాధితులు
- సర్కారు భూములు పేదలకు చెందాల్సిందే : జాన్‌వెస్లీ



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పేదలకు చెందాల్సిన సర్కారు భూములను పెట్టుబడిదారులకు దారదత్తం చేస్తామంటే చూస్తూ ఊరుకోబోమని, రామోజీరావు లాంటి ఎంత మంది బడాబాబులు వచ్చినా ఈ జాగాలు పేదలకు దక్కేవరకు పోరాడుతామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని నాగన్‌పల్లి, పొల్కంపల్లి, రాయపోల్ గ్రామాలకు చెందిన ఇళ్లు లేని నిరుపేదల కోసం 2007లో నాగన్‌పల్లి రెవెన్యూ పరిధిలోని 189, 203 సర్వే నెంబర్‌లో సుమారు 20 ఎకరాల్లో 600 మంది పేదలకు అప్పటి ప్రభుత్వం స్థలాలు కేటాయించింది. ఈ ఇంటి జాగాలను పేదలకు ఇవ్వాలని సిపిఎం రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నాలుగు గ్రామాల ప్రజలు సుమారు 800 మందితో బుధవారం రామోజీ ఫిల్మ్ సిటీలో పేదలకు కేటాయించిన భూముల్లో నిరసన వ్యక్తం చేశారు. అంతకు ముందు నాగన్‌పల్లి గ్రామ శివారు నుంచి ఫిల్ సిటీ వరకు పెద్ద ఎత్తున ఎర్రజెండాలు చేబుని, నినాదాలు చేస్తూ.. ర్యాలీ నిర్వహించారు. రామోజీరావు కాజేయాలని చూస్తోన్న పేదల జాగాలను రక్షించాలని, పేదలకు ఇళ్ల జాగాలు ఇవ్వాలని నినాదాలతో హోరెత్తించారు.

ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూమిలోకి రాకుండా అడ్డంగా గేట్లు పెట్టడం.. గోడలు నిర్మించడానికి ఈ జాగాలు రామోజీరావు సొత్తుకాదని హెచ్చరించారు. పేదల భూములను కాజేయాలని చూస్తే ఎంతటి వారినైనా తరిమికొట్టే దమ్ము ఎర్రజెండాకు ఉందన్నారు. పేదల ఇంటి స్థలాల కోసం నాటి ప్రభుత్వాలు కేటాయించిన జాగాలను.. తాము చూసుకోవడానికి వస్తే పోలీసుల అడ్డగింతలు, రెవెన్యూ అధికారుల హెచ్చరికలు వస్తున్నాయని అన్నారు. రామోజీ రావు, సిఎం కెసిఆర్ ఎవరు అడ్డు వచ్చినా పేదల ఇంటి జాగాల కోసం కేటాయించిన భూముల్లో ఇండ్లు నిర్మించి తీరుతామని తెలిపారు. పేదలకు చెందాల్సిన ఇంటి జాగాలపై సిఎం కెసిఆర్ స్పందించి తక్షణమే పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి సరైన సమాధానం వచ్చే వరకు పోరు ఆగదన్నారు. ఇల్లు లేని నిరుపేదలందరికి ఇంటి జాగాలు ఇవ్వాలన్నారు.

సిపిఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కె.భాస్కర్ మాట్లాడుతూ.. పేదల ఇంటి నిర్మాణాల కోసం కేటాయించిన ప్రభుత్వ భూములను రామోజీ ఫిల్మ్ సిటీ యాజమాన్యం కాజేయాలని చూడటం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వ భూముల కబ్జాకోరులో మొదటి స్థానంలో ఉన్న రామోజీ రావు.. చివరికి పూటగడవని కడుపేద ప్రజల ఇంటి జాగాలను వదలకుండా స్వాధీనం చేసుకోవడానికి కుటిల ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఫిల్మ్ సిటీ నడ్డిబొడ్డున ఉన్న భూములను పేదలకు దక్కొద్దన్న దురుద్దేశంతో రామోజీ రావు రెవెన్యూ యంత్రాంగాన్ని తమ గుప్పెట్లోకి తీసుకుని కుట్రలు చేస్తున్నారన్నారు. రామోజీరావుకు ఊడిగం చేస్తున్న ప్రభుత్వ యంత్రాంగం తమ హక్కును పేదలపై చూపుతోందన్నారు. కార్యక్రమంలో సిపిఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సామేల్, పగడాల యాదయ్య, జగదీశ్, జిల్లా కమిటీ సభ్యులు జంగయ్య, జగన్, నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.



దేశంలో అరాచక పాలన

- ప్రజా సమస్యలను గాలికొదిలేసిన బిజెపి సర్కారు
- రైతు సంఘం రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి : జూలకంటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశం మొత్తంలో బిజెపి ప్రభుత్వమే ఉండేలా మోడీ కుట్ర చేస్తున్నారని, అరాచక పాలన సాగిస్తున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి విమర్శించారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణ కేంద్రంలో బుధవారం నిర్వహించిన సిపిఎం నియోజకవర్గస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. మోడీ, అమిత్‌షా ఇద్దరూ డబుల్ ఇంజిన్ పాలన పేరుతో మతపరమైన విద్వేషాలు సృష్టించి పబ్బం గడుపుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సెంటిమెంట్లతో మళ్లీ అధికారంలోకి రావాలని చూస్తున్నారని చెప్పారు. ఎన్నికలు దగ్గర పడుతున్నకొద్దీ దాడులకు పాల్పడుతున్నారన్నారు. అందులో భాగంగానే మంత్రులపై ఐటీ దాడులు జరుగుతున్నాయన్నారు. బిజెపికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా బలమైన పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే వ్యతిరేక రాజకీయ పార్టీలు ఉద్యమాలు చేస్తున్నాయని, గతంలో జరిగిన రైతు ఉద్యమమే ఇందుకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలో బిజెపిని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో బిజెపికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేస్తామని తెలిపారు. ఈ నెల 27న నల్లగొండలో జరిగే రైతు సంఘం రాష్ట్ర మహాసభ నేపథ్యంలో భారీ ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహిస్తామని, రైతులు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, డాక్టర్ మల్లు గౌతమ్‌రెడ్డి, రాగిరెడ్డి మంగారెడ్డి, వరలక్ష్మి, పరశురాములు, సీతారాములు, భవాండ్ల పాండు, శశిధర్ రెడ్డి, వినోద్‌నాయక్, రొండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నిజాలు మాట్లాడటమే నేరమైంది

- మనిషిని మనిషిగా గుర్తించాలి
- ప్రొఫెసర్ హరగోపాల్



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సమాజంలోని అసమానతలు తొలగిపోయి మనిషిని మనిషిగా గుర్తించే రోజులు రావాలని, ప్రస్తుతం దేశంలో నిజాలు మాట్లాడటమే నేరమైందని, ఇది ప్రజాస్వామ్యం మనుగడకు ప్రమాదం అని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. భారత విప్లవోద్యమ నేత చంద్ర పుల్లారెడ్డి 38వ వర్ధంతి సందర్భంగా అమరుల స్మారక కమిటీ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో డేగల రమ అధ్యక్షతన అమరుల సంస్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమరులను స్మరించుకోవడం అంటే ప్రత్యామ్నాయ రాజకీయాలను ఆహ్వానించడమేనని చెప్పారు. సమాజంలోని అసమానతలు తొలగిపోయి మనిషిని మనిషిగా గుర్తించే రోజులు రావాలన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. మతం పేరుతో జరుగుతున్న విద్వేషాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఏదో ఒకరోజు ప్రజలు తప్పకుండా మార్పును కోరుకుంటారని, ఆ మార్పే ప్రత్యామ్నాయ వ్యవస్థ అన్నారు.

మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు జీవన్ కుమార్ మాట్లాడుతూ.. అమరుల ఆశయాల సాధన కోసం ముందుకు సాగాలన్నారు. రాష్ట్రంలో తీవ్రమైన నిర్బంధం కొనసాగుతోందని, దీనిపై ప్రజలు నిరసన తెలుపుతున్నారని చెప్పారు. దేశంలో అంబానీ ఆదాయం పెరుగుతుంది కానీ ప్రజల బతుకుల్లో మార్పు రావడం లేదన్నారు. ప్రజా గాయకులు విమలక్క మాట్లాడుతూ.. అమరుల త్యాగాలను ఎత్తిపడుతూ వారు చూపిన బాటలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు మోహన్ బైరాగి, మన్సూర్, రైతు కూలీ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు నాగిరెడ్డి, బొమ్మకంటి కొమురయ్య, పిడిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి అల్లూరి విజయ్, ఎఐఎఫ్‌టియు నాయకులు అనసూయ, మల్లేష్, రాములు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ముంచేందుకే పంపుసెట్లకు మీటర్లు

- మద్దతు ధర ఇవ్వడంలో మోడీ ప్రభుత్వం విఫలం : సారంపల్లి మల్లారెడ్డి



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రైతులను నిలువునా ముంచేందుకే వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి చేస్తోందని ఆల్ ఇండియా కిసాన్ సభ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో బుధవారం తెలంగాణ రైతు సంఘం జిల్లా తొమ్మిదోవ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర చెల్లించకుండా ఆ విషయాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తోందన్నారు. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా జిల్లా రైతాంగానికి నీరు అందించాలని, ప్రాజెక్టు పరిధిలో భూములు, ఇళ్లు కోల్పోయిన రైతులకు ఇంటి స్థలం ఇచ్చి ఇల్లు కట్టించాలని, రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, ధరణిలో రైతు సమస్యలను పరిష్కరించాలని మహాసభలో తీర్మానం చేశారు. అనంతరం 15 మందితో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా గుండుమల్ల నర్సింహులు, ఉపాధ్యక్షులుగా ఎ రాములు, ప్రధాన కార్యదర్శిగా ఎ లక్ష్మయ్య, సహాయ కార్యదర్శిగా జె మధు, జె బాల్ రెడ్డి తదితరులను ఎన్నుకున్నారు.



ప్రజల కొనుగోలు శక్తి పెరిగితే.. ఆర్థిక వ్యవస్థ బలోపేతం

- మాజీ ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ నాగేశ్వర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజల కొనుగోలు శక్తి ఎంత పెరిగితే అదే స్థాయిలో ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్ అన్నారు. ఎస్ఎఫ్ఐ ఓయు కమిటీ ఆధ్వర్యంలో ఓయులోని అంబేద్కర్ లైబ్రరీ ఐఎస్ఎస్ఆర్ హాల్లో బుధవారం 'భారత ఆర్థిక పయనం ఎటు' అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెద్ద నోట్ల రద్దుతో దేశంలో పెట్టుబడిదారులకు లబ్ది జరిగింది కానీ సాధారణ ప్రజలకు ఎలాంటి ఉపయోగమూ కలగలేదన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ ఐదో స్థానంలో ఉందని, 2030లో జపాన్, జర్మనీ దేశాలను దాటవేసి మూడో స్థానంలో ఉంటుందన్నారు. అయితే, బ్రిటన్ కంటే భారత్ ముందు స్థాయిలో ఉందనుకోవడం మన పొరపాటన్నారు. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా కార్ల ఉత్పత్తి వేగంగా పెరిగిందని, వీటి కోసం ప్రభుత్వాలు అనేక రాయితీలు ఇచ్చాయని చెప్పారు. ఉత్పత్తిదారుల మూలంగానే ఆర్థిక వ్యవస్థలో ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. అయితే, పెట్టుబడిదారులకు కల్పించే రాయితీల కంటే పేదలకూ ఉత్పత్తిలో రాయితీలు అందిస్తే గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ మొత్తంలో లబ్ది పొందుతారన్నారు. ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ. చింత గణేష్ మాట్లాడుతూ.. భారత ఆర్థిక వ్యవస్థ అనేది ఎల్‌పిజి నమూనాలో ముందుకు వెళ్తుందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటీకరణ చేయొద్దని కోరారు. పొలిటికల్ సైన్స్ డిపార్ట్‌మెంట్ ప్రొ.చంద్రు నాయక్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా భారత ఆర్థిక వ్యవస్థ క్రమక్రమంగా క్షీణిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సహజ వనరులన్నీ సమాన ఉద్దేశంతో అందరికీ సమపాలుగా పంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఓయు అధ్యక్ష, కార్యదర్శులు ఆంజనేయులు, రవి నాయక్, ఉపాధ్యక్షులు రామాటేంకి శ్రీను, శర్మ, మమత, సాయి కిరణ్, సహాయ కార్యదర్శి రాజు, పవన్ కళ్యాణ్, నాయకులు సాయి ధనుష్, అజయ్ కళ్యాణ్, అనుష, స్వాతి పాల్గొన్నారు.

శ్రీనివాసరావుది ప్రభుత్వ హత్యే

- ఇప్పటికైనా సర్కారు కళ్లు తెరవాలి
- సిఎం కెసిఆర్‌కు రేవంత్ లేఖ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఎఫ్ఆర్ఒ శ్రీనివాసరావుది ప్రభుత్వ హత్యేనని పిసిసి అధ్యక్షులు, ఎంపి ఎనుముల రేవంత్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కండ్లు తెరవాలని కోరారు. ఈ మేరకు బుధవారం సిఎం కెసిఆర్‌కు ఆయన లేఖ రాశారు. తెలంగాణలో పోడు భూముల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. అందుకే అటవీ శాఖ అధికారులు, పోడు భూములు సాగు చేసుకుంటున్న గిరిజనుల మధ్య నిత్యం చిచ్చు రేగుతోందని పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఫారెస్ట్ రేంజ్ అధికారి (ఎఫ్ఆర్ఒ) చలమల శ్రీనివాసరావు గుత్తికోయల దాడిలో హత్యకు గురికావడం చాలా దారుణమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేతగానితనంతోనే ఒక అధికారి ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చిందని వివరించారు. 'పోడు భూములపై హక్కులు కల్పిస్తామని గత ఎనిమిదేండ్లుగా రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులను ఊరిస్తోంది. మరోవైపు అటవీ భూములను సేద్యం చేస్తున్నారని వివరించారు. ఇదే గిరిజనులపైకి అధికారులను ఎగదోస్తూ చోద్యం చూస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్వాకం వల్ల తెలంగాణ వచ్చినప్పటి నుంచి అటవీ శాఖ అధికారులు, గిరిజనుల మధ్య నిత్యం ఘర్షణలు జరుగుతూనే ఉన్నాయి. పోడు భూముల్లో ఫారెస్ట్ ఆఫీసర్లు మొక్కలు నాటేందుకు రావడం, గిరిజనులు అడ్డుకోవడం, వారి మధ్య గొడవలు జరగడం పరిపాటిగా మారింది. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది గిరిజనులపై కేసులు పెట్టారు. పోడు భూములు సాగు చేస్తున్న రైతుల పోరాటాలు, ఉద్యమాలు చేసినా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదు. పోడు భూములకు పట్టాలిస్తాం అని అసెంబ్లీలో ప్రకటన చేసి మూడేండ్లు గడిచింది. పోడు సమస్య పరిష్కారానికి గతేడాది సెప్టెంబర్ 16న మంత్రి సత్యవతి రాథోడ్ ఛైర్ పర్సన్‌గా ఒక కమిటీని నియమించారు. కమిటీని నియమించి దాదాపు 14 నెలలైనా ఇంత వరకు అతీగతీలేదు. అధికారులు అభద్రతాభావంతో విధులు నిర్వహించాల్సిన దుస్థితి వచ్చింది. ఇప్పటికైనా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి' అని పేర్కొన్నారు.

ఇంటి స్థలంలేని పేదల సంగతేంటి!

- పట్టాలున్నా పొజిషన్ చూపని వైనం
- ఇళ్ల పథకంలో రిజర్వేషన్లపై అస్పష్టత
- నాలుగు దశల్లో డబ్బుల చెల్లింపు
- ఇతర పథకాల్లో లబ్ధిపొందితే నో ఛాన్స్
- స్థలాల్లేని పేదలకు స్థలాల్వివ్వాలి : సిపిఎం



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్థలం ఉండి ఆర్థిక స్థోమత లేనివారికి సొంతింటి నిర్మాణానికి రూ.3 లక్షల ఆర్థిక సాయం చేసే పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. సిఎం కెసిఆర్ ఇటీవల ఈ పథకం గురించి ఎమ్మెల్యేలను అప్రమత్తం చేశారు. పథకం ఉద్దేశం బాగానే ఉంది. కానీ..! ఇండ్లు లేని, ఇంటి స్థలంలేని పేదల సంగతేంటనే ప్రశ్న ఎదురవుతోంది. స్థలాల్లేని వాళ్లకు ప్రభుత్వమే స్థలాలివ్వాలనే డిమాండ్ వస్తోంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 90 శాతం మంది పేద, నిరుపేదలంతా ఎస్సీ, ఎస్‌టి, బిసిలే ఉన్నారు. ఇండ్ల నిర్మాణ పథకంలో వారికి రిజర్వేషన్ల ప్రకారం కేటాయింపు చేస్తామనడంలో ఆంతర్యమేంటనే చర్చ వినిపిస్తోంది. రేషన్‌కార్డు, ఇండ్ల స్థలాల్లేని పేదల గురించి ఈ పథకంలో ఏమైనా పేర్కొంటారా.. లేదా.. చూడాలి.

గ్రామీణ ప్రాంతంలో కనీసం 75 గజాలు, పట్టణాల్లో 50 గజాల స్థలం ఉన్న లబ్ధిదారులకు ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం అందించే పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టనున్నది. ఈ పథకం గురించి ఎప్పటి నుంచో చర్చ ఉన్నప్పటికీ తాజాగా సిఎం కెసిఆర్ ఈ పథకం అమలు గురించి ప్రకటించారు. లబ్దిదారుల ఎంపిక విషయంలో ఎమ్మెల్యేలను పురమాయించడంతో పథకం గురించి ఇండ్లులేని పేదల్లో ఆసక్తి కనిపిస్తోంది. పథకం అమలు గురించి లబ్దిదారుల ఎంపిక, డబ్బుల చెల్లింపు వంటి మార్గదర్శకాలు వెలువడనున్నాయి. ఇంటి స్థలం ఉండి ఇండ్లు కట్టుకోలేని పేదలకు ప్రభుత్వం రూ.3 లక్షలు అందించనుంది. తెలంగాణ స్టేట్ టెక్నలాజికల్ సంస్థ సహకారంతో లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ కొనసాగనుంది. ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సాయాన్ని నాలుగు దశల్లో పేమెంట్ చేసే అవకాశముంది. బేస్‌మెంట్, గోడల నిర్మాణం, స్లాబ్, ఫినిషింగ్ ఇలా నాలుగు దశల్లో పనులు జరిగాక రూ.75 వేల చొప్పున లబ్దిదారులకు అందజేస్తారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 4 లక్షల మంది లబ్దిదారులకు ఈ పథకంలో లబ్ది చేకూర్చాలని ప్రభుత్వం భావిస్తోంది. నియోజకవర్గానికి 3 వేల ఇండ్ల చొప్పున నిర్మాణం చేయనున్నారు. ఇప్పటికే రూ.12 వేల కోట్ల నిధుల్ని ప్రకటించారు. దాంతో పథకం అమలుకు నిధుల ఇబ్బంది ఉండదని అధికారులు పేర్కొంటున్నారు.

స్థలాల్లేని పేదల సంగతేంటీ..?

రాష్ట్రంలో ఇండ్ల స్థలాల కోసం పెద్ద ఎత్తున పోరాటాలు సాగాయి. సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లోని అనేక మండల, పట్టణ కేంద్రాల్లో ఇండ్ల స్థలాల్లేని పేదలు ప్రభుత్వ భూముల్లో గుడిసెలేసుకొని పట్టాల కోసం కొట్లాడారు. ఆ పోరాటాల ఫలితంగా చాలా చోట్ల అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పట్టాలు కూడా ఇచ్చింది. వాళ్లకు పొజిషన్ చూపలేదు. పొజిషన్ చూపిన చోట కంపెనీలు, రోడ్లు, డబుల్ ఇండ్ల పేరిట తిరిగి గుంజుకున్నారు. సంగారెడ్డి జిల్లాలోని జిన్నారం మండలంలో నిరుపేదలకు ఇండ్ల స్థలాలకు పట్టాలిచ్చి ఇప్పటి వరకు పొజిషన్ చూపలేదు. సదాశివపేట మండల కేంద్రంలో 5300 మంది పేదలు పోరాడిన ఫలితంగా 2012లో ఇండ్ల స్థలాలకు పట్టాలిచ్చి.. ఆ తర్వాత పొజిషన్ చూపలేదు. ఆ భూములు ఇప్పటికీ ఖాళీగానే ఉన్నాయి. ఆ భూములను పట్టాలున్న తమకు పొజిషన్ చూపాలని సిపిఎం ఆధ్వర్యంలో పేదలు నెల రోజులుగా ఆందోళనలు చేస్తున్నారు. మెదక్ జిల్లాలో రామయణంపేట, మెదక్ పట్టణంలో ఇండ్ల స్థలాల కోసం పోరాడారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు పట్టాలిచ్చింది. అయితే ప్రస్తుత ప్రభుత్వం పేదలకు పట్టాలిచ్చిన భూముల్ని స్వాధీనం చేసుకొని డబుల్ ఇండ్లను కట్టింది. అందులో పట్టాలున్న పేదలెవ్వరికీ ఇండ్లు కేటాయించలేదు. వాళ్లందరూ ఇప్పుడు రూ.3 లక్షల పథకానికి అర్హులు కాకుండా పోతున్నారు. పుల్కల్ మండలంలోని ముదిమాణిక్యంలో నిరుపేదలుంటున్న కాలనీలో పూరి గుడెసెల్లోనే మగ్గుతున్నారు. వాళ్లకు డబుల్ స్కీంలో ఇండ్లు కట్టివ్వలేదు. సంగారెడ్డి, జహీరాబాద్, నారాయణఖేడ్, పటాన్‌చెరు, ఆందోళ్, మెదక్, సిద్దిపేట, గజ్వేల్, నర్సాపూర్, మెదక్, హుస్నాబాద్ నియోజకవర్గాల్లోని స్వంత ఇంటి స్థలాల్లేని పేదలు పెద్ద ఎత్తున ఉన్నారు. పారిశ్రామిక వాడల్లో దశాబ్దాలుగా స్థిరపడి జీవిస్తున్న వలస కార్మికులకూ ఇండ్లు, ఇళ్ల స్థలాలూ లేవు. ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పథకంలో లాటరీ ద్వారా కొద్దిమందికే ఇండ్లు ఇచ్చింది. 80 శాతం మంది పేదలకు ఆ పథకంలో ఇండ్లు రాలేదు. ప్రస్తుతం అమలు చేస్తున్న రూ.3 లక్షల పథకంలోనూ స్థలాల్లేవనే నెపంతో ఇండ్లు దక్కే అవకాశమూ లేకపోలేదు.

రిజర్వేషన్ల వల్ల లాభమేంటీ..?

ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షల ఆర్థిక సాయం చేసే పథకంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు రిజర్వేషన్లు అమలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఎస్‌సిలకు 15 శాతం, ఎస్‌టిలకు 10 శాతం చొప్పున కేటాయిస్తారంటున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఇండ్లు లేని పేదల్లో 90 శాతం మంది ఎస్‌సి, ఎస్‌టి, బిసిలే ఉంటారు. వీరికి చట్ట ప్రకారం ఉన్న రిజర్వేషన్ల మేరకే లబ్దిదారులను ఎంపిక చేస్తే మిగతా వారికి సొంతింటి కల ఎలా నెరవేరుతుందనే చర్చ గ్రామాల్లో జరుగుతోంది. నియోజకవర్గానికి 3 వేల ఇండ్లు కేటాయిస్తారంటున్న ప్రభుత్వం.. అందులో ఎస్సీ, ఎస్టీలకు కలిపి 25 శాతం మాత్రమే కేటాయిస్తే మొత్తం ఇండ్లు లేని ఎస్సీ, ఎస్టీలకు సొంతిల్లు దక్కుతుందా అని దళిత సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. 90 శాతంగా ఉన్న పేదలకు మొదటి ప్రాధాన్యతగా లబ్దిదారుల ఎంపిక జరగాలని కోరుతున్నారు. అదే విధంగా గతంలో లబ్దిపొందిన వాళ్లకు ఈ పథకంలో అర్హతలేదనే చర్చ వినిపిస్తుంది. పదేండ్ల కిందట ఉమ్మడి కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయి. అప్పులు చేసి రెండు గదులు వేసుకున్నారు. ఇద్దరు, ముగ్గురు కొడుకులున్న ఆ ఇంట్లో వాళ్లకు పెళ్లిండ్లు అయ్యి పిల్లలతో వేరుపడి ఒకే ఇంట్లో ఉంటున్నారు. వాళ్లకు ఈ పథకంలో వర్తింప చేస్తరా లేదా అనేది స్పష్టతలేదు. రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకుని ఎదురు చూస్తున్న వాళ్లను కూడా పరిశీలించాలంటున్నారు.

ఆర్థిక సాయమే కాదు ఇండ్ల స్థలాలూ ఇవ్వాలి: మల్లేశం, సిపిఎం జిల్లా కార్యదర్శి, మెదక్

పట్టణ, మండల కేంద్రాల్లో ఇండ్ల స్థలాల్లేని నిరుపేదలున్నారు. వారందరూ గతంలో పోరాడారు. ఫలితంగా చాలా చోట్ల పేదలకు ఇండ్ల స్థలాలకు పట్టాలిచ్చారు. టిఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక ఎక్కడా ఇండ్ల స్థలాలివ్వలేదు. పైగా గత ప్రభుత్వం ఇచ్చిన పట్టాలను రద్దు చేయడం, లేదంటే పేదలకిచ్చిన స్థలాలను లాక్కోవడం చేసింది. పోరాడి సాధించుకున్న పట్టాదారులకు పొజిషన్ చూపి కొత్తగా ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం చేయాలి. ఇండ్ల స్థలాల్లేని పేదలకు ప్రభుత్వమే స్థలాల్ని కేటాయించి వారికి ఇంటి నిర్మాణం కోసం సాయం చేయాలి. సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో పారిశ్రామిక కేంద్రాల్లోనే కాకుండా ఇతర ప్రాంతాల్లోనూ స్థలాల్లేని పేదలకు ఇండ్ల స్థలాలు కేటాయించి పట్టాలివ్వాలి. పట్టాలిచ్చిన చోట వెంటనే పొజిషన్ చూపాలి.

5300 మందికి ఈ పథకం వర్తింపజేయాలి: ప్రవీణ్, సిపిఎం మండల కార్యదర్శి, సదాశివపేట

పోరాడిన ఫలితంగా 2012లో అప్పటి ప్రభుత్వం పేదలకు ఇండ్ల స్థలం చూపించి పట్టాలిచ్చింది. ఇండ్ల నిర్మాణం చేస్తామని చెప్పి చేయకుండా వదిలేసింది. అట్టి భూమిని పట్టాలున్న పేదలకు పొజిషన్ చూపాలి. వాళ్లందరూ నిరుపేదలైనందున ప్రభుత్వం కొత్తగా అమలు చేయనున్న పథకం వర్తింప చేసి ఇండ్లు కట్టుకునేందుకు అవకాశం కల్పించాలి. పొజిషన్ కోసం పేదలు నెలల తరబడి పోరాడుతున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడంలేదు. పొజిషన్ చూపే వరకు పోరాడుతాం.

బిఎస్ఎన్ఎల్ 4జిని ఆదరించండి

- సేవలు విస్తరిస్తున్నాం...
- టెలికం సిజిఎం కెవిఎన్ రావు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఎస్ఎన్ఎల్ సేవలను వినియోగించుకొని ప్రభుత్వరంగ సంస్థను ఆదరించాలని టెలికం చీఫ్ జనరల్ మేనేజర్ కెవిఎన్ రావు విజ్ఞప్తి చేశారు. ఆబిడ్స్‌లోని టెలికం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ సర్కిల్ పరిధిలో బిఎస్ఎన్ఎల్ అత్యంత బలమైన నెట్‌వర్క్ కలిగి ఉందనీ, 4జీ సేవల కోసం దాన్ని మరింత పటిష్టం చేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 76 ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ సేవలు అందిస్తున్నామన్నారు. 6 నెలలు, ఏడాది ప్లాన్లలో వినియోగదారులకు ఉచితంగా ఫైబర్ కనెక్షన్‌తోపాటు వైఫై మోడెం కూడా ఇస్తున్నామని తెలిపారు. ఇన్‌యాక్టివ్‌గా ఉన్న కష్టమర్లను యాక్టివ్ చేసేందుకు బిఎస్ఎన్ఎల్ 25 శాతం డిస్కౌంట్ కూడా ఇస్తున్నదని చెప్పారు. రాష్ట్రంలో 695 టెలికం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రొవైడర్లు (టిప్), 74 ఫ్రాంచైజ్‌లు, 20 ఇంటిగ్రేటర్స్, 550 మంది డైరెక్ట్ సెల్లింగ్ ఏజెంట్లు, 11 వేల మంది రిటైలర్స్ ఉన్నారని వివరించారు. 4జీ సేవల విస్తరణ కోసం 4,100 మొబైల్ టవర్లు, రూ.60 కోట్ల వ్యయంతో 1,363 కి.మీ., ఆప్టికల్ ఫైబర్ కేబుల్ ఏర్పాటు, మరో 390 గ్రామాలకు 4జి సేవల విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. వినియోగదారులను ఆకర్షించేందుకు పలు స్కీంలు కూడా ప్రవేశపెడుతున్నామని తెలిపారు.

బిఎస్ఎన్ఎల్ ఆధ్వర్యంలో వన్97 కమ్యూనికేషన్స్ లిమిటెడ్ సంస్థ సహకారంతో గత ఏడాది డిసెంబర్ 13 నుంచి వినియోగదారులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. రూ.186, రూ.666 ఓచర్లతో రీచార్జ చేసుకున్న వినియోగదారులు ఈ క్విజ్ పోటీలో పాల్గొనవచ్చని తెలిపారు. ప్రతి వారం లక్కీ డ్రా తీసి రెండు స్మార్ట్ మొబైల్‌ఫోన్లు, ప్రతి నెలా తీసే డ్రాలే ఒక ఐప్యాడ్, ఆరు నెలలకోసారి తీసే డ్రాలో గ్రాండ్ ప్రైజ్‌గా మారుతి స్విఫ్ట్ కారును వినియోగదారులకు అందిస్తున్నామని తెలిపారు. ఈ స్కీం నిరంతరం కొనసాగుతుందన్నారు. ఇటీవల తీసిన గ్రాండ్ ప్రైజ్ డ్రాలో మల్కాజ్‌గిరికి చెందిన ప్రదీప్ కుమార్ మారుతి స్విఫ్ట్ కారును గెలుచుకున్నారని చెప్పారు. ఇదే కార్యక్రమంలో విజేతకు కారు తాళాలు అందచేశారు. ఈ సందర్భంగా విజేత ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్ సేవల్ని వినియోగించకుండా, పుకార్లను నమ్మొద్దని అన్నారు. తాను సంస్థ నుంచి మెరుగైన సేవలు పొందుతున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో టెలికం తెలంగాణ సర్కిల్ పీజీఎమ్ (హెచ్ఆర్) శాస్త్రి, జనరల్ మేనేజర్ (సేల్స్ అండ్ మార్కెటింగ్) రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్షౌరవృత్తిపై రిలయన్స్ పంజా

- కార్పొరేట్ సెలూన్లు, బ్యూటీపార్లర్ల పేర పెట్టుబడులు
- బతుకుదెరువుపై దెబ్బ
- రిలయన్స్ పెట్టుబడుల్ని వ్యతిరేకిస్తూ ఆందోళనలు


హెయిర్ కటింగ్ చేస్తున్న క్షౌరవృత్తిదారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
'రెక్కాడితేగానీ.. డొక్కాడని' పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్న క్షౌరవృత్తిదారుల బతుకుదెరువుపై రిలయన్స్ పంజా విసరబోతోంది. కేంద్ర ప్రభుత్వం పెద్ద పెద్ద ప్రభుత్వ రంగ సంస్థలనే కాకుండా చిరు వ్యాపారాలు, సేవా వృత్తుల్నీ బడా సంస్థల చేతుల్లో పెట్టేందుకు సిద్ధపడింది. అలా లాభసాటి వ్యాపారాలు చేసే రిలయన్స్, స్పా వంటి పెట్టుబడిదారీ సంస్థలు సేవా, సంప్రదాయ వృత్తినే వ్యాపారం చేసేందుకు సిద్ధపడ్డాయి. రిలయన్స్, స్పా భారీ పెట్టుబడులు పెడితే లక్షలాది మంది క్షౌరవృత్తిదారులు వీధిన పడనున్నారు. తరాల నుంచి సంప్రదాయ వృత్తిగా కొనసాగుతున్న క్షౌరవృత్తిదారులు కటింగ్, సేవింగ్ పనులే కాకుండా పుడుతు పోయేవరకు నుంచి చావు వరకు అనేక సేవలందిస్తున్నారు. పొద్దస్తం నిలబడి పని చేయడం వల్ల అనేక వ్యాధులకు గురవుతూ చాలీచాలని బతుకులు బతుకుతున్న క్షౌరవృత్తిదారుల జీవనాధారాన్ని దెబ్బతీసేందుకు బడా పెట్టుబడిదారులు సిద్ధమవుతున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా మూడు లక్షలకుపైగా కటింగ్ షాపులున్నాయి. వీటిల్లో ఐదు లక్షల మంది వరకు క్షౌరవృత్తి ద్వారా ఉపాధి పొందుతున్నారు. వృత్తిదారుల కుటుంబాల్లోని 20 లక్షల మందికి పైగా క్షౌరవృత్తి జీవనాధారంగా ఉంది. ఒక్క గ్రేటర్ హైదరాబాద్‌లోనే 75 వేల వరకు కటింగ్ షాపులున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 23 వేల మంది ఉన్నారు. సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, పటాన్‌చెరు, జహీరాబాద్, నర్సాపూర్, గజ్వేల్ వంటి పట్టణాలే కాకుండా ప్రతి పల్లెల్లోనూ నాయిబ్రాహ్మణులు చెట్టుకింద కుర్చీ వేసుకుని వృత్తి చేయడం మొదలుకొని సెలూన్ షాపులు నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. పొద్దంతా నిలబడి కట్టింగ్, గడ్డం చేస్తే కనీస కూలీ గిట్టడంలేదు. పైగా నిలుచుండి పనిచేయడం వల్ల నరాలు బిగుసుకుపోయి తిమ్మిర్లు, చర్మ వ్యాధులు వస్తున్నాయి. కంటి చూపు దెబ్బతింటుంది. కస్టమర్ల ద్వారా టీబీ, శ్వాసకోశ, కరోనా, చర్మ క్యాన్సర్ వంటి వ్యాధులు వ్యాపించడం వల్ల వృత్తికి దూరమవుతున్నారు. ఉన్నట్టుండి మూలిగే నక్కపై తాటికాయ పడిన చందంగా బ్యూటీపార్లర్స్, సెలూన్ పేరిట రిలయన్స్ వంటి బడా సంస్థలు పెట్టుబడులు పెట్టడం వల్ల లక్షలాది మంది క్షౌరవృత్తిదారులు వీధిన పడనున్నారు. రిలయన్స్ దుకాణాలు వస్తే క్షౌర దుకాణాలు మూతపడే ప్రమాదం ఏర్పడింది.

బ్యూటీపార్లర్లు, సెలూన్ వ్యాపారం

2009లోనే రిలయన్స్ సంస్థలు సెలూన్ వృత్తిలోకి వస్తున్నట్టు ప్రకటించాయి. అప్పట్లో నాయిబ్రాహ్మణ సంఘాలు, వృత్తి సంఘాలు సమన్వయంతో పోరాడాయి. రిలయన్స్ గోబ్యాక్ అంటూ పెద్ద ఎత్తున ఉద్యమించాయి. రిలయన్స్ రాకను వ్యతిరేకిస్తూ వామపక్షాలు, టిఆర్‌ఎస్‌నూ వ్యతిరేకించి వృత్తిదారులకు మద్దతిచ్చాయి. తాజాగా మళ్లీ రిలయన్స్ సంస్థ క్షౌరవృత్తిలోకి రాబోతున్నట్టు ప్రకటించి బ్యూటీపార్లర్లు, కార్పొరేట్ సెలూన్లు పెట్టి సేవా వృత్తిని వ్యాపారం చేయాలని చూస్తుంది. హైదరాబాద్ మహానగరంతో పాటు వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నల్లగొండ, సంగారెడ్డి, నిజామాబాద్, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ పాత జిల్లా కేంద్రాలే కాకుండా కొత్తగా ఏర్పడిన జిల్లా కేంద్రాలు, మున్సిపల్ పట్టణ ప్రాంతాల్లో రిలయన్స్ బ్రాంచీలు విస్తరించనున్నాయి. హంగూ ఆర్భాటాలు, ఏసీ వంటి సదుపాయాలు పెట్టి కస్టమర్లను ఆకర్షించడం ద్వారా సంప్రదాయ క్షౌరవృత్తిదారుల ఉపాధిని దెబ్బతీయనున్నారు. క్రమంగా సెలూన్ దుకాణాల్లో యజమానిగా ఉన్న వృత్తిదారులే రిలయన్స్ షాపుల్లో కూలీలుగా మార్చుకునే కుట్ర జరుగుతోంది.

వేల కుటుంబాలు వీధిన పడతాయి: రాంచందర్, సంగారెడ్డి

45 ఏళ్లుగా క్షౌరవృత్తి చేస్తున్న. మేమే కాదు మహిళలూ సేవ చేస్తారు. పొద్దస్తం నిలబడి ఉంటం. కటింగ్, గడ్డం చేసినా కూలి గిట్టుబాటు కాదు. దుకాణాల అద్దెలు, సెలూన్ వస్తువుల ధరలు బాగా పెరిగాయి. కస్టమర్లు ఇచ్చిన మేరకు డబ్బులు తీసుకుని పనిచేస్తాం. ఊర్లల్లో కట్టడి పద్ధతిలో ఏడాదంతా పెళ్లిళ్లు, చావులు, పుట్టుకలకు కుటుంబమంతా సేవ చేస్తాం. అన్ని రకాలుగా పనిచేసినా కుటుంబం గడవడం కష్టంగా ఉంది. ఉన్నంతలో బతుకుతున్న మా పొట్టగొట్టేందుకు రిలయన్స్ సంస్థ వస్తుంది. కార్పొరేటోళ్లు వస్తే మాలాంటి చిన్న దుకాణాలు మూతపడతాయి. ఇంటిల్లిపాది వీధిన పడతాం. నిరుపేదలు, అనారోగ్యం పాలైన వాళ్లు, కురు వృద్ధులకు ఇబ్బందికరమైనా మేం ఓపికతో వారికి గడ్డం, కటింగ్ చేస్తం. ఇచ్చింది తీసుకుంటం. రిలయన్స్ వస్తే అలాంటి వాళ్లకు ఎవరు చేయాలి.

రిలయన్స్ సంస్థను వ్యతిరేకిస్తాం: ఎం.శ్రీశైలం, నాయిబ్రాహ్మణ సేవా సంఘం జిల్లా ఉపాధ్యక్షులు

రిలయన్స్ సంస్థ క్షౌరవృత్తిని కబ్జా చేస్తే ఊరుకోం. కార్పొరేట్ సెలూన్లు వస్తే మా జీవన వృత్తి దెబ్బతింటది. ఉన్నట్టుండి పెట్టుబడిదారులు దుకాణాలు పెడితే మేం ఏం కావాలి. ఇప్పటికే రిలయన్స్ పెట్టుబడుల్ని వ్యతిరేకిస్తూ ఆందోళనలు చేసినం. దుకాణాలు పెడితే వాటిని అడ్డుకుని తీరుతం. వృత్తిదారుల్ని దెబ్బతీసేందుకు జరుగుతున్న కుట్రల్ని అన్ని వృత్తిదారులు ఐక్యంగా ఎదుర్కోవాలి. అతి భ్రంగా ఉండే అనాథలు, బిచ్చగాళ్లు, మతిస్థిమితంలేనివాళ్లు, అనారోగ్యులకు కూడా మేం కటింగ్, గడ్డం చేస్తున్నం. మా వృత్తి సేవ మాత్రమే వ్యాపారం కాదు.

కార్పొరేట్ల చేతుల్లో క్షౌరవృత్తి ప్రమాదకరం: చెన్నారం మల్లేశం, నాయిబ్రాహ్మణ వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి

సంప్రదాయక సేవా వృత్తిగా ఉన్న క్షౌరవృత్తిలోకి కార్పొరేట్ సంస్థలు రావడం ప్రమాదకరం. ప్రభుత్వాలు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించలేకపోయినా సంప్రదాయకంగా క్షౌరవృత్తి ద్వారా లక్షలాది మంది ఉపాధి పొందుతూ తరాలుగా సమాజానికి సేవ చేస్తున్నారు. వ్యాపార దృక్పథంతో కాకుండా సేవా దృక్పథంతో కట్టింగ్ చేయడం, గుండు, గడ్డం, పుట్టు వెంట్రుకలు గీయడం, పుణ్యక్షేత్రాల్లో తలనీలాలు తీసే పనులు చేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా రిలయన్స్ దిష్టిబొమ్మల దగ్ధం వంటి కార్యక్రమాలు చేశాం.


దామోదరావు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

దాము అమెరికాలో కళాకారుల రాయబారి

ప్రజాశక్తి - కల్చరల్ (హైదరాబాద్)
తెలుగు నేల పై పుట్టి అమెరికాలో స్థిరపడి సాహితీవేత్తలను, కళా కారులకు ఆతిథ్యమిస్తూ ఆదరిస్తున్న కళాకారుల రాయబారి దామోదరావు (దాము)అని ప్రముఖులు కొనియాడారు. అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఇంటర్నేషనల్ మిమిక్రీ ఆర్టిస్ట్ నిర్వాహణలో శ్రీత్యాగరాయ గాన సభలోని కళా సుబ్బారావు కళా వేదికలో విదేశీయ ఉంద్రుడు సౌజన్యశీలి దాముకు మిమిక్రీ, మేజిక్ కళాకారులు, సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా వంశీ రామరాజు మాట్లాడుతూ అమెరికా వెళ్లిన తెలుగు కళాకారులకు కర దీపికలా దాము ఖర్చుకు వెనకడుగు వేయకుండా ఆదరించే ఉత్తముడు అని ప్రశంసించారు. వృత్తిత్వ వికాస నిపుణుడు జివిఎన్ రాజు అధ్యక్షత వహించి మాట్లాడుతూ విద్య వైద్యం రంగాల్లో తాను పుట్టిన నేల ప్రజలకు సహాయపడుతూ దాము సమాజానికి తాను తిరిగి ఇవ్వటంలో ఆదర్శప్రాయంగా నిలిచారని అభినందించారు. అమెరికాలో తెలుగు కళాకారులు ఆయన ఆదరణ పొందని వారు లేరని పేర్కొన్నారు. బాలల సాహిత్య రచయిత దొర్బాల రమణ మాట్లాడుతూ దాము వివాహం చేసుకునే వందలాది మంది యువతులకు బంగారు మంగళ సూత్రం బహుకరించారని అన్నారు. అమెరికాలో స్థిరపడిన మరో సౌజన్యదాత హరికిషన్ మాట్లాడుతూ అమెరికాలో ఆతిథ్యం ఆదరణ పొందిన వారు కొందరు ఇక్కడ వస్తే మొహం చాటు చేస్తారని కృతజ్ఞత భావం మనిషికి ముఖ్యమన్నారు. యువకళావాహిని అధ్యక్షుడు లంకా లక్ష్మీనారాయణ, పేరడీ కళాకారుడు గురుస్వామి, ఆనందలహరి సంస్థ నిర్వాహకుడు మల్లం రమేష్, భాగి శాస్త్రి మాట్లాడుతూ స్పందన ప్రసంగంలో మనసులను కలిపే మనసులు ముఖ్యమని, మనం చేసే మంచి పనులే మన వారసులకు శ్రేయస్సు కలిగిస్తుందని అన్నారు.

కేంద్ర దర్యాప్తు సంస్థలు బిజెపికి తొత్తులు

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
దేశంలో ఇడి, సిబిఐ, ఐటి వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను మోదీ ప్రభుత్వం చేతిలో ఆయుధాలుగా మారడం ఆందోళనకరమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శించారు. హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో బుధవారం సిపిఐ మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కార్యవర్గ సమావేశాన్ని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్ శంకర్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ.. సిబిఐ, ఐటి, ఇడిలను ఉపయోగించి ప్రతిపక్ష పార్టీలను, ప్రభుత్వాలను అంతం చేసేందుకు కుట్రపూరిత ఆలోచనల్తో ప్రధాని మోదీ నిమగ్నమై పనిచేయడం దురదృష్టకరమని అన్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థలు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి తొత్తులుగా మారడం వల్ల ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. బడా కార్పొరేట్ సంస్థల లక్షల కోట్ల మోసాలు, బిజెపి పాలిత రాష్ట్రాల్లోని ఆ పార్టీ నేతల అవినీతి వంటి కుంభకోణాల మీద మోడీ ప్రభుత్వం ఎందుకు సిబిఐ, ఇడి, ఐటిలతో దర్యాప్తు జరపడం లేదని ప్రశ్నించారు. ప్రజాసమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. డబుల్ బెడ్రూం ఇండ్లు, దళితులు, గిరిజనులకు మూడెకరాల భూమి, భూమిలేని నిరుపేదలకు భూదాన భూముల పంపిణీ, ఖాళీ పోస్టుల భర్తీ కోసం సమరశీల పోరాటాలు నిర్మించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎన్ బాలమల్లేష్, మేడ్చల్- మల్కాజ్‌గిరి జిల్లా కార్యదర్శి డిజి సాయిలుగౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు రొయ్యల కృష్ణమూర్తి, వెంకట్‌రెడ్డి, జె లక్ష్మి, శంకర్, ధర్మేంద్ర, హరినాథ్‌రావు, దశరథ్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ రేసింగ్ లీగ్‌కు ఎక్సాన్‌మోబిల్ మద్దతు

ప్రజాశక్తి-హైదరాబాద్
ఇండియన్ రేసింగ్ లీగ్‌కు మద్దతు అందించడానికి రేసింగ్ ప్రమోషన్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు ఎక్సాన్‌మొబిల్స్ తెలిపింది. నవంబర్ 19న ప్రారంభమైన ఈ రేసింగ్ గ్రాండ్ ఫినాలే డిసెంబర్ 10-11 తేదీలలో హైదరాబాద్‌లో జరుగుతుందని పేర్కొంది. రేసింగ్ ప్రమోషన్స్‌తో భాగస్వామ్యం ఈ రంగానికి మరింత విలువను జోడిస్తుందని పేర్కొంది.

ఆర్టికల్ 200ను సవరించాలి

- లా కమిషన్ చైర్మన్‌కు వినోద్‌కుమార్ లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
రాజ్యాంగంలోని ఆర్టికల్ 200కు సవరణలు చేయాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. 'ఆజ్ సూన్ ఆజ్ పాసిబుల్' అనే పదాన్ని మార్చేసి "విత్ ఇన్ 30 డేస్'గా సవరణ చేయాలని కోరారు. ఈ మేరకు లా కమిషన్ చైర్మన్ తిరురాజ్ ఆవస్తికి బుధవారం ఆయన లేఖ రాశారు. అసెంబ్లీ, శాసనమండలి ఆమోదించిన బిల్లులను ఆయా రాష్ట్రాల గవర్నర్లు నిర్ణీత గడువులోగా ఆమోదించేలా చేయాలని సూచించారు. అందుకే ఆర్టికల్ 200ను సవరించాల్సిన అవసరముందని వివరించారు.

బిజెపియేతర రాష్ట్ర ప్రభుత్వాలను గవర్నర్లు ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. ప్రజాస్వామ్యయుతంగా, ప్రజల తీర్పు వల్ల ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వాలను రాజకీయంగా నామినేట్ కాబడిన గవర్నర్లు ఇబ్బందుల పాలు చేస్తుండటం దురదృష్టకరమని పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించకుండా ఎఫ్ఎల్ఎన్ అమలు అసాధ్యం

- టిఎస్‌యుటిఎఫ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
ప్రాథమిక పాఠశాలల్లో మౌలిక సమస్యలను పరిష్కరించకుండా ప్రాథమిక అభ్యసనా సామర్థ్యాల సాధన (ఎఫ్ఎల్ఎన్)ను అమలు చేయడం అసాధ్యమని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్‌యుటిఎఫ్) తెలిపింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను తీర్చకుండా, వారిపై రాతపని భారాన్ని తగ్గించకుండా, శాశ్వత పర్యవేక్షణ అధికారులను నియమించకుండా ఎఫ్ఎల్ఎన్ అమలు కోసం పైస్థాయిలో అధికార యంత్రాంగంతో ఎన్ని కమిటీలు ఏర్పాటు చేసినా ఫలితం ఉండబోదని పేర్కొన్నారు. ఎఫ్ఎల్ఎన్ అమలును పర్యవేక్షించటానికి నోడల్ అధికారులను నియమించారని తెలిపారు. విద్యాశాఖ అధికారులు, కలెక్టర్లు తదితర యంత్రాంగమంతా ప్రాథమిక పాఠశాలలపై మూకుమ్మడిగా దాడి చేసినట్టు పర్యటించి ఉపాధ్యాయుల మనోధైర్యాన్ని దెబ్బతీస్తున్నారని విమర్శించారు. విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారని తెలిపారు. ఇది చాలదన్నట్టు జిల్లా అకడమిక్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయడం వల్ల అదనంగా ఒరిగేదేమీ ఉండదని పేర్కొన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో 11 వేల ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నాయని వివరించారు. ఏడు వేల మందిని సర్దుబాటు పేరుతో ఉన్నత పాఠశాలలకు డిప్యూటేషన్‌పై పంపించారని గుర్తు చేశారు.

ఈ విద్యా సంవత్సరంలోనే సమాంతరంగా ఇంగ్లీషు మీడియం కూడా ప్రారంభించారని తెలిపారు. ఉపాధ్యాయుల్లేకుండా ఎఫ్ఎల్ఎన్ అమలు ఎలా సాధ్యమౌతుందని ప్రభుత్వాన్ని వారు ప్రశ్నించారు. పాఠశాలల్లో సరిపడినంతమంది ఉపాధ్యాయులను నియమించి, శాశ్వత పర్యవేక్షణ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులపై ఒత్తిడి తగ్గించి బోధనాభ్యసన ప్రక్రియ స్వేచ్ఛగా సాగేలా వాతావరణం కల్పించాలని కోరారు.

బుద్ధిజం పూర్వ వైభవం కోసం కృషి

- మంత్రి శ్రీనివాస్‌గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
బుద్ధిజం పూర్వ వైభవం కోసం కృషి చేస్తున్నట్టు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. హైదరాబాద్‌లో భూటాన్ నుంచి అంతర్జాతీయ బౌద్ధ సమాఖ్యకు చెందిన భూటాన్ కేంద్ర మంత్రి కార్యదర్శి ఉగ్యేన్ నామ్ గ్యేల్ నేతృత్వంలో 24 మంది ప్రతినిధులు మంత్రితో బుధవారం సమావేశమయ్యారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఆచార్య నాగార్జునుడు నడియాడిన ప్రదేశం నాగార్జునసాగర్‌లో బుద్ధవనం ప్రాజెక్టును అంతర్జాతీయ స్థాయిలో నిర్మించినట్టు తెలిపారు. ఆ ప్రాజెక్టులో బౌద్ధ ఆరామాల నిర్మాణం తెలుసుకునేందుకు ఇప్పటికే తైవాన్, ఇండోనేషియా, మంగోలియా, బెంగుళూరుకు చెందిన మహాబోధి సొసైటీకి చెందిన బౌద్ధ సంస్థలు సంప్రదించాయని చెప్పారు.

సమావేశంలో భూటాన్‌కు చెందిన బౌద్ధ అంతర్జాతీయ సమాఖ్య, రాష్ట్ర పర్యాటక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జునిడిపై అంతర్జాతీయ సదస్సు నిర్వహించే అంశంపై చర్చించారు. ఆచార్య నాగార్జునుడి బోధనలు, సిద్ధాంతాలు - నేటి ప్రపంచ శాంతికి అవసరమనే విషయాలపై సదస్సులో చర్చిస్తే బాగుంటుందనే అభిప్రాయానికి వచ్చారు. రాష్ట్రంతో సాంస్కృతిక, ఆధ్యాత్మిక, ఆర్థిక సంబంధాలు మెరుగుపరుచుకునేందుకు భూటాన్ ఆసక్తిగా ఉందని మంత్రి వెల్లడించారు. సమావేశంలో రాష్ట్ర బుద్ధవనం ప్రాజెక్ట్ ప్రత్యేకాధికారి మల్లెపల్లి లక్ష్మయ్య, పర్యాటకశాఖ ఎండి మనోహర్ పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలి

- అధికారులకు మంత్రి వేముల

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో
నిర్మాణం తుది దశలో ఉన్న ఇండ్లకు మౌలిక సదుపాయాలు వెంటనే పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తూ పేదల సొంతింటి కలను నెరవేర్చే డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణ ప్రగతి, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ వివరాలపై బుధవారం హైదరాబాద్‌లో ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్ శర్మ, ఇతర రాష్ట్రస్థాయి ఉన్నత అధికారులు పాల్గొన్నారు. రెండు పడకల గృహ నిర్మాణ పథకంలో ఇప్పటి వరకు రాష్ట్రంలో 2,91,057 ఇండ్లు రూ.19,328.32 కోట్ల అంచనా వ్యయంతో అనుమతి ఇచ్చామని తెలిపారు.

2,28,529 గృహాలకు సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తి చేసి నిర్మాణం పూర్తి చేశామని వెల్లడించారు. నిర్మాణం ప్రారంభించిన 2,28,529 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకుగానూ 1,29,528 గృహాలు ఇప్పటికే పూర్తి అయ్యాయని తెలిపారు. మిగతా 58,350 గృహాల నిర్మాణం తుది దశలో ఉన్నదని పేర్కొన్నారు.

మిగతా 40,651 ఇండ్లు వివిధ దశలలో నిర్మాణంలో ఉన్నాయన్నారు. నిర్మాణం పూర్తి అయినవి, నిర్మాణ తుది దశలో ఉన్న ఇండ్లకు మౌలిక సదుపాయాలు పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం కోసం రూ.11,614.95 కోట్లు ఖర్చు చేసిందని వెల్లడించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా త్వరగా పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు ఇండ్లు అప్పగించేందుకు తగిన ఏర్పాట్లు పూర్తి చేయాలని మంత్రి సూచించారు.

పంచాయతీరాజ్ శాఖ పునర్వ్యవస్థీకరణ

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
రాష్ట్రంలోని పంచాయతీరాజ్ రోడ్లను అందంగా, అద్దంలా ఉంచాలన్న సిఎం కెసిఆర్ ఆదేశాల మేరకు పంచాయతీరాజ్ శాఖ పునర్వ్యవస్థీకరణ వేగవంతం చేయాలని అధికారులను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ తాగునీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదేశించారు. అధికారాలను, బాధ్యతలను వికేంద్రీకరించాలనీ, అవసరమైన పోస్టుల భర్తీ చేసేందుకు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. బుధవారం హైదరాబాద్‌లోని మంత్రుల నివాస ప్రాంగణంలో పంచాయతీరాజ్ కార్యదర్శి రఘునందన్‌రావు, ఇంజినీర్ ఇన్ చీఫ్ సంజీవరావు, ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి దయాకర్‌రావు మాట్లాడుతూ..రోడ్ల మరమ్మత్తులు, నిర్వహణపై డిసెంబర్ 10లోపు టెండర్ల ప్రతిపాదనలు పూర్తి చేయాలనీ, డిసెంబర్ 15 నాటికి పనులు ప్రారంభించాలని ఆదేశించారు. వరదనీటితో దెబ్బతిన్న రోడ్లకు ప్రాధాన్యత ఇవ్వాలనీ, అటవీ భూముల సమస్యపై దృష్టి పెట్టాలని సూచించారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన మండలాలు, గ్రామ పంచాయతీలలో కొత్త సర్కిళ్లు, డివిజన్ల వారీగా వేయాల్సిన కొత్త రోడ్లను, అవసరమైన సిబ్బంది కోసం కొత్త పోస్టుల భర్తీకి సంబంధించి గురువారం సాయంత్రంలోగా నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఈ నెల 19న జరిగిన పంచాయతీ రాజ్ ఇంజినీర్స్ వర్క్ షాప్‌లో చర్చించిన రోడ్ల తక్షణ మరమ్మత్తులు, నిర్వహణ ప్రతిపాదనలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలు, నియోజక వర్గాలవారీగా అత్యవసరమైన పనుల జాబితా రూపొందించాలన్నారు.

'అదానీ' పట్ల అప్రమత్తంగా ఉండండి

- ఎంఅండ్‌జి ఇన్వెస్ట్‌మెంట్

న్యూఢిల్లీ : అపార కుబేరుడు, ప్రధానీ నరేంద్ర మోడీకి సన్నిహితుడగా గుర్తింపు ఉన్న గౌతమ్ అదానీకి అప్పులు ఎక్కువ, నగదు రాబడి తక్కువగా ఉందని ఎంఅండ్‌జి ఇన్వెస్ట్‌మెంట్ (సింగపూర్) పిటిఇ పేర్కొంది. "పోర్టులు, విమానాశ్రయాలు, రైలు, లాజిస్టిక్స్ వ్యాపారాలు అదానీకి నగదును ఉత్పత్తి చేసేవిగా ఉన్నాయి. అయితే అదానీ గ్రూపునకు సంబంధించి అనేక అస్పష్టతలు, సమాచారం బయటికి ఇవ్వకపోవడం, విలువ గురించి అనేక ప్రశ్నలు ఉన్నాయి. ఇది చాలా గమ్మత్తయినది." అని సింగపూర్‌కు చెందిన ఫండ్ మేనేజర్ వికాస్ పర్షద్ ఓ ఇంటర్యూలో పేర్కొన్నారు. "కంపెనీలు చిన్నగా ఉన్నప్పుడు, పెట్టుబడిదారులు సులభంగా చెబుతారు. కానీ.. భారత స్టాక్ మార్కెట్లలో 6 శాతం వాటా కలిగిన అదానీ గ్రూపు విలువ, వ్యాపారాలు నాకు అర్థం కావడం లేదు. "పెట్టుబడిదారులు, ఇష్టపడినా ఇష్టపడకపోయినా.. ఆ కంపెనీ ఏమి చేస్తుందో దానిపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని నేను భావిస్తున్నాను. ఏడాదిలో అదానీ ఎంటర్‌ప్రైజెస్ విలువ 160 రెట్లు పెరిగింది. ఈ విలువను ఏ సమయంలోనైనా సమర్థించడం కష్టం." అని పెర్షాద్ చెప్పారు. గుజరాత్ కేంద్రంగా పని చేస్తోన్న అదానీ గ్రీన్ ఎనర్జీ కంపెనీ రుణాలు- ఈక్విటీ నిష్పత్తి 2,021 శాతంగా ఉంది. అంటే రూ.1 ఈక్విటీ విలువపై రూ.2,021 మొత్తాన్ని అప్పుగా పొందుతున్నారని ఇటీవల బ్లూమ్‌బర్గ్ ఓ రిపోర్టులో పేర్కొన్న విషయం తెలిసిందే.

సానుకూలం అంటూనే సాగదీత

- ఉప ఎన్నిక అయిపాయే.. విఆర్‌ఎల సమస్యలు తీరకపాయే
- కేసులెత్తేయలే... సమ్మెకాలం జీతం ఇప్పించలే
- అక్టోబర్ ఏడో తేదీ పోయి రెండువారాలాయే
- అంతా సిఎం చేతుల్లోనే అంటూ చేతులెత్తేసిన సిఎస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
విఆర్‌ఎల విషయంలో సానుకూలంగా ఉన్నామంటూనే రాష్ట్ర సర్కారు సాగదీస్తోంది. ఓ సారి మంత్రి కెటిఆర్... మరోమారు సిఎస్ సోమేశ్‌కుమార్... ఇంకోమారు మంత్రి కెటిఆర్, హరీశ్‌రావు ఇచ్చిన హామీలతో విఆర్‌ఎలు సమ్మె విషయంలో వెనక్కి తగ్గి విరమించినా వారిపై దయతల్చట్లేదు. మునుగోడు ఉప ఎన్నిక ఫలితాలొచ్చి 15 రోజులు దాటినా మీనమేషాలు లెక్కిస్తూనే ఉంది. గతంలో ఇచ్చిన హామీ మేరకు తమ సమస్యలు పరిష్కరించాలని విఆర్‌ఎ జెఎసి నేతలు సిఎస్ సోమేశ్‌కుమార్‌ను సంప్రదిస్తే 'నేనేం చేయలేను. అంతా సిఎం చేతుల్లోనే ఉంది' అంటూ దాటవేయడం గమనార్హం. రాష్ట్ర ప్రభుత్వాన్ని నమ్మిన విఆర్‌ఎల పరిస్థితి ప్రస్తుతం అగమ్యగోచరంగా తయారైంది.

విఆర్‌ఎల విషయంలో మొదటి నుంచీ 'అయ్యో! వారి బతుకులు అంతంతే.. వారిపట్ల సానుకూలంగా ఉన్నాం' అంటూ సానుభూతి చూపుతూనే సమస్యల పరిష్కారాన్ని రాష్ట్ర సర్కారు తొక్కి పెడుతోంది. పేస్కేలు, వారసత్వ ఉద్యోగాలు, ప్రమోషన్లు, సొంతూర్లలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కట్టియడంతో పాటు సమస్యలన్నీ పరిష్కారిస్తామని అసెంబ్లీ సాక్షిగానూ, పలు సమావేశాల్లోనూ సిఎం కెసిఆర్ హామీలు ఎప్పుడు నెరవేరుస్తారో అని విఆర్‌ఎలు కళ్లల్లో ఒత్తులేసుకుని ఎదురుచూస్తున్నారు. అయినా వారికి అడుగడుగునా నిరాశే మిగులుతోంది. వేడుకున్నా.. వినతులిచ్చినా.. అర్జీలు పెట్టుకున్నా... ఆందోళనలు చేసినా రాష్ట్ర సర్కారు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుండటంతో రాష్ట్రంలోని 24 వేలకుపైగా ఉన్న విఆర్‌ఎలు సమ్మెలోకి వెళ్లారు. తమ పోరాటాన్ని చర్చనీయాంశంగా మారారు. సెప్టెంబర్ 13న విఆర్‌ఎలు చేపట్టిన చలో అసెంబ్లీ పిలుపునకు ఇంటిలిజెన్స్ కండ్లుగప్పి రాష్ట్ర నలుమూలల నుంచి ఎవరికివారు సద్దులు కట్టుకుని హైదరాబాదుకొచ్చి తమ పోరాట ఆవశ్యకతను సమాజానికి ఎత్తిచూపారు. పోలీసులు నిశ్చేష్టులై 144 సెక్షన్ విధించినా, షాపులన్నీ మూసేయించినా ఎక్కడ అడ్డుకున్నారో అక్కడే కదిలేది లేదంటూ బైటాయించారు. పరిస్థితి చేయి దాటడంతో జెఎసి బృందాన్ని మంత్రి కెటిఆర్ అసెంబ్లీకి పిలుపించుకున్నారు. 'విఆర్‌ఎల డిమాండ్లు న్యాయమైనవి. సానుకూలంగా ఉన్నాం. చనిపోతున్న విఆర్‌ఎలందరూ తెలంగాణ బిడ్డలే. స్వాతంత్ర్య దినోత్సవ వజ్రోత్సవాలు, జాతీయ సమైక్యతా వజ్రోత్సవాలు కార్యక్రమాలు ముగియగానే సెప్టెంబర్ 20న చర్చలకు పిలుస్తాం' అని జెఎసి నేతలకు మంత్రి కేటీఆర్ హామీనిచ్చారు. అప్పుడు సమ్మె విరమించకున్నా పోరాట రూపం విషయంలో కాస్త వెనక్కి తగ్గారు. ఆ తర్వాత మెట్రో రైల్వే భవన్‌లో విఆర్‌ఎ జెఎసి నేతలతో మంత్రి కెటిఆర్ చర్చలు జరిపి మరోమారు నచ్చజెప్పారు. ఆ తర్వాత విఆర్‌ఎ జెఎసి నేతలు, సిఐటియు రాష్ట్ర నాయకత్వంతో కలిసి బిఆర్‌కె భవన్‌లో సిఎస్ సమావేశమయ్యారు. 'నవంబర్ ఏడో తేదీ వరకు ఆగండి. మునుగోడు ఉప ఎన్నికల కోడ్ అయిపోగానే సమస్యను పరిష్కరిస్తాం. సిఎం మీ పట్ల సానుకూలంగా ఉన్నారు. దయచేసి సమ్మె విరమించండి' అంటూ ఆ సమయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. దీంతో 23 వేల మంది వీఆర్‌ఏలు సమ్మెను విరమించి 80 రోజుల తర్వాత విధుల్లో చేరారు. ఆరోజు చర్చల సందర్భంగా సమ్మెకాలానికి సంబంధించిన వేతనాన్ని ఇప్పించేందుకు ప్రయత్నిస్తామనీ, చలో అసెంబ్లీ, ఆర్‌టిసి క్రాస్‌రోడ్డులో జరిగిన మెరుపు ధర్నాల సమయంలో విఆర్‌ఎలపై పెట్టిన కేసులను ఎత్తివేస్తామని సిఎస్ హామీనిచ్చారు. మునుగోడు ఉప ఎన్నిక అయిపోయిందిగానీ రాష్ట్ర సర్కారు నుంచి విఆర్‌ఎలకు ఇంకా పిలుపురాలేదు. జీవితకాలం వేధిస్తున్న సమస్యలు పరిష్కారం కాలేదు. 'సానుకూలం అంటూనే సాగదీయడం దారుణం. రాష్ట్ర ప్రభుత్వంపై నమ్మకం ఉంచి వెనక్కి తగ్గితే ఇలాగేనా చేసేది. అయినా, ఇంకా కొద్దిరోజులు వేసి చూస్తాం. అప్పటికీ స్పందించకపోతే మళ్లీ భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తాం. విజయం సాధించేదాకా వెనకడుగు వేయం' అంటూ విఆర్‌ఎల జెఎసి నేతలు గట్టిగా చెబుతున్నారు.

ఎసిబి వలలో జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
మున్సిపల్ కమిషనర్, మేనేజర్ లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు చిక్కిన సంఘటన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో బుధవారం జరిగింది. ఎసిబి డిఎస్‌పి ఆనంద్ కుమార్ కథనం ప్రకారం... జహీరాబాద్ పట్టణంలోని ముసానగర్ కాలనీలో మహ్మద్ నిసార్ ఇల్లు కొనుగోలు చేశారు. ఈ ఇంటిని మ్యూటేషన్ చేయించడానికి మున్సిపల్ అధికారులను కలిశారు. ఇంటికి సంబంధించిన కాగితాలు సక్రమంగా లేవని, లిటిగేషన్‌లో ఉన్నందున మ్యూటేషన్ చేసేందుకు మున్సిపల్ మేనేజర్ మనోహర్ రూ.మూడు లక్షలు కావాలని డిమాండ్ చేశారు. అన్ని డబ్బులు తన వద్ద లేవని, తగ్గించాలని నిసార్ విజ్ఞప్తి చేశారు. కమిషనర్ సుభాష్‌రావు వద్దకు తీసుకెళ్లి ఆయన సమక్షంలో చర్చలు జరిపారు. రూ.రెండున్నర లక్షలు ఇవ్వాలని ఒప్పందం కుదుర్చుకున్నారు. అంత డబ్బు ఇచ్చుకోలేని నిసార్ ఎసిబి అధికారులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్ మనోహర్ వద్దకు రూ.2.50 లక్షలు డబ్బులు ఇచ్చేందుకు నిస్సార్ వెళ్లారు. రూ.రెండున్నర లక్షలు కాదు రెండు లక్షలు మాత్రమే ఇవ్వండి.. చాలు అని మనోహర్ చెప్పి.. వాటిని అటెండర్ రాకేష్‌కు ఇవ్వాలని సూచించారు. ఆ డబ్బును అటెండర్ రాకేష్ తీసుకొని కమిషనర్ సుభాష్‌రావు, మేనేజర్ మనోహర్‌కు అందజేశారు. వెంటనే ఎసిబి అధికారులు వలపన్ని కమిషనర్, మేనేజర్‌ను పట్టుకున్నారు. జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్ సుభాష్‌రావును ఏ 1గా, మేనేజర్ మనోహర్‌ను ఏ 2గా, అటెండర్ రాకేష్‌ను ఏ 3గా కేసు నమోదు చేశారు. ఈ దాడిలో ఏసీబీ సీఐలు వెంకట్ రాజాగౌడ్, రమేష్ సిబ్బంది పాల్గొన్నారు.

అవినీతిని భరించలేకనే ఎసిబిని సంప్రదించాను

ఇంటి మ్యూటేషన్‌కు రూ.మూడు లక్షల లంచం అడుగుతున్నారంటే నిరుపేదలను ఏ స్థాయిలో దోచుకుంటున్నారో భయమేస్తోంది. ఈ దోపిడీని అరికట్టేందుకే ఎసిబి అధికారులను ఆశ్రయించాను. ఆరు నెలలుగా మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరిగితే అధికారులు రకరకాలుగా ఇబ్బంది పెట్టారు. రూ.లక్షలు లంచం డిమాండ్ చేయడం భరించలేకపోయాను. ఇప్పటికైనా అధికారుల్లో మార్పు రావాలని, ప్రజలకు సేవ చేయాలని మనవి.

- మహమ్మద్ నిసార్, బాధితుడు

కౌంటర్ అఫిడవిట్ ఎందుకు దాఖలు చేయలేదు?

- ఎల్అండ్‌టి మెట్రోరైలు ప్రాజెక్టు సెస్‌పై ప్రభుత్వం సీరియస్
- జెసిఎల్‌పై చర్యలకు కార్మికశాఖ ఉత్తర్వులు
- సిపిఎం పోరాటంతో తెర పైకి..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
'ఎల్అండ్‌టి మెట్రోరైలు ప్రాజెక్టుకు సంబంధించిన సెస్ ఎగవేత విషయంలో కోర్టులో కౌంటర్ అఫిడవిట్ ఎందుకు దాఖలు చేయలేదో 15 రోజుల్లో వివరణ ఇవ్వాలి' అంటూ కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ ఆర్.చంద్రశేఖరాన్ని తెలంగాణ సర్కార్ ఆదేశించింది. దీనికి సంబంధించి ఈ నెల 15న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జిఓ నెంబర్ 526ను జారీ చేసింది. రాష్ట్రంలోనూ, గ్రేటర్ హైదరాబాద్‌లోనూ రూ.10 లక్షలకుపైన పనులు చేసిన వందలాది కంపెనీల నుంచి కార్మికశాఖ సెస్ వసూలు చేయడం లేదని సిపిఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే నగరంలో ఎల్అండ్‌టి ఆధ్వర్యంలో చేపట్టిన మెట్రోరైలు ప్రాజెక్టుకు సంబంధించిన ఒక శాతం సెస్ చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని సిపిఎం పోరాడింది. దీంతో సెస్ రూ.163.75 కోట్లు చెల్లించాలని 2014లో ఎల్అండ్‌టి మెట్రోరైలు లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్‌కు రంగారెడ్డి జిల్లా జాయింట్ కమిషనర్ లేఖ రాశారు. దానిపై ఎల్అండ్‌టి మెట్రోరైలు ప్రాజెక్టు యాజమాన్యం 2014లో హైకోర్టు నుంచి డబ్ల్యూపీ నెం.35582/2014 స్టే తెచ్చుకుంది. స్టే ఎత్తివేయడానికి కార్మికశాఖ అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. దీనిపై సైతం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి సిపిఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఫిర్యాదు చేసింది. అయినా అధికారులు స్పందించలేదు. దీనిపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం కూడా నివేదిక ఇచ్చింది. వీటన్నింటి నేపథ్యంలో స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ (హెడ్‌ఆఫీసు) ఆర్.చంద్రశేఖరంపై ఛార్జెస్ ఫ్రేమ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 15 రోజుల్లో వివరణ ఇవ్వాలని పేర్కొంది. సదరు అధికారి ఇచ్చిన వివరణ ఆధారంగా ప్రభుత్వం చర్యలు తీసుకునే అవకాశముంది. అప్పటి వరకు వేచిచూడాల్సిందే.

అవినీతిపై విచారణ జరిపించాలి..
ఎం.శ్రీనివాస్, సిపిఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి

కార్మిక శాఖలో సెస్ ఎగవేత, అవినీతిపై ఎసిబితో విచారణ జరిపించాలి. ఒక్క ఎల్అండ్‌టీ మెట్రోరైలు ప్రాజెక్టు మాత్రమే కాదు వందలాది కంపెనీల నుంచి సెస్ వసూలు చేయడం లేదు. మొదట్లో ఎల్అండ్‌టి మెట్రోరైలు ప్రాజెక్టు వ్యయం రూ.14 వేల కోట్లు ఉంటే ప్రస్తుతం రూ.20 వేల కోట్లకు చేరింది. ఒక శాతం సెస్‌తోపాటు వడ్డీ కలిపి రూ.400 కోట్లకుపైగానే ఉంటుంది. మొత్తాన్ని వసూలు చేయాలి. సెస్ వసూలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై విచారణ జరిపించాలి.